క్లుప్తంగా

ప్రారంభమైన శనీశ్వరస్వామి ఉత్సవాలు



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

అమరాపురం: మండల పరిధిలోని ఆలదపల్లి గ్రామంలో వెలసిన శనీశ్వరస్వామి పునఃప్రాణ ప్రతిష్టాపన ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అర్చకులు ఉదయం కలశ స్థాపన, దీక్షా హోమం, దేవతలకు గంగా పూజ, గణ, నవగ్రహాల దేవతలకు హోమం, తదితర పూజలను నిర్వహించారు. నూతన ఆలయంలో శనీశ్వరస్వామి, నవగ్రహాలను ప్రాణ ప్రతిష్టాపన చేయడానికి అర్చకులు వాస్తు, శాంతి, గణ, తదితర హోమాలను నిర్వహించారు. అలాగే సోమవారం తెల్లవారు జామున శనీశ్వరస్వామి విగ్రహాన్ని ప్రాణ ప్రతిష్టాపన చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు.

శ్రీనివాస స్కిన్, డెంటో కేర్ ఆస్పత్రి ప్రారంభం



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: పట్టణంలోని ఆర్‌పీజీటీ రోడ్డులో డాక్టర్ శ్రీనివాసనాయక్ ఆధ్వర్యంలో శ్రీనివాస స్కిన్ అండ్ డెంటోకేర్ ఆస్పత్రిని ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసనాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రి పక్కన ఉన్న శ్రీనివాస స్కిన్, డెంటోకేర్‌ను ఆర్‌పీజీటీ రోడ్డులో నూతన భవనంలో ప్రారంభించామన్నారు. అవాంచిత రోమాలకు లేజర్ చికిత్స, పచ్చబొట్టు, మంగు మచ్చలు, మొటిమల మచ్చలకు చికిత్స, సీఓ2 లేజర్ చికిత్స, స్కిన్ అలర్జీలకు ప్రత్యేక చికిత్సతో దంత చికిత్సలు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రొళ్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ నిర్వహించనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ షేక్షావలి తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల ద్వారా అందించాలన్నారు. మండల స్థాయి అధికారులు ప్రజా సమస్యల పరిష్కార వేదికకు విధిగా హాజరు కావాలని కోరారు.


భక్తిశ్రద్ధలతో మండల పూజ



అలంకరణలో నాగదేవతల విగ్రహాలు

పరిగి: మండలంలోని ఊటుకూరులో ప్రతిష్ఠించిన నాగులకు ఆదివారం మండల పూజ నిర్వహించారు. గ్రామంలోని బీచిగానిపల్లి రోడ్డులో రెడ్డి కులస్తుల ఆధ్వర్యంలో నాగుల ప్రతిష్ఠ చేపట్టారు. గత 41 రోజుల క్రితం నూతనంగా నాగుల విగ్రహాలను పునఃప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆదివారం గ్రామంలోని రెడ్డి కులస్తులంతా కలిసి మండల పూజ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ప్రత్యేక హోమాలు, అభిషేకాలను నిర్వహించారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రశంసాపత్రాలు, ట్రోఫీలను చూపుతున్న కరాటే విద్యార్థులు

హిందూపురం: చిక్కబళాపురంలో జరిగిన నేషనల్ లెవెల్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో పురం విద్యార్థులు ప్రతిభ కనబరిచారని కరాటే మాస్టర్ సెన్సేయి ఫైరోజ్ తెలిపారు. ఫైట్ కేటగిరీలో 11 ప్రథమ స్థానాలు, 5 ద్వితీయ స్థానాలు, 2 తృతీయ స్థానాలను సాధించారని తెలిపారు. విజేతలకు మెమెంటోలు, సర్టిఫికెట్‌లు అందించి అభినందించినట్లు పేర్కొన్నారు.

విత్తన వేరుశనగకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

మడకశిరరూరల్: రబీలో బోరు బావుల కింద వేరుశనగ సాగు చేసే రైతులకు అందించే సబ్సిడీ విత్తన వేరుశనగకు రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏఓ తిమ్మప్ప తెలిపారు. క్వింటాల్ పూర్తి ధర రూ.9,600 ఉండగా 40 శాతం సబ్సిడీ పోనూ రైతు రూ.5,760 చెల్లించాలన్నారు. కరెంట్ బిల్లు, ఆధార్, పట్టాదారు పాసు పుస్తకం తీసుకెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఒక రైతుకు మూడు బస్తాలు చొప్పున పంపిణీ చేస్తామని వివరించారు.

రోడ్డెక్కాలంటే భయం.. భయం

» హిందూపురం పట్టణంలోని పరిగి రోడ్డులో ఈ మధ్యనే ద్విచక్ర వాహనంలో వస్తున్న ఇద్దరు యువకులకు ఉన్న ఫలంగా కుక్క అడ్డు వచ్చింది. కుక్కను తప్పించబోయి వాళ్లిద్దరూ కింద పడిపోవడంతో తీవ్రగాయాల పాలయ్యారు.

» పట్టణంలోని ప్రధాన రహదారిపై పశువులు పోట్లాడుకుంటూ అటుగా బైక్‌లో వెళ్తున్న వారిని తగిలాయి. దీంతో బైక్‌లో ప్రయాణిస్తున్న భార్యాభర్తలు కింద పడటంతో తీవ్రంగా గాయపడ్డారు.

» ఇలా ఈ ఏడాదిలో జంతువుల కారణంగా ఎన్నో రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఆయా ఘటనల్లో సుమారు 300 మందిపైగా గాయాలపాలయ్యారు.

- రహదారులపై విచ్చలవిడిగా సంచరిస్తున్న పశువులు, కుక్కలు, పందులు
- తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు

హిందూపురం: పట్టణంలో ఎటు చూసినా పందులు.. ఏ వీధిలో చూచిన కుక్కలు.. ప్రధాన రహదారుల్లోనే తిష్టవేస్తున్న పశువులు.. దీంతో రోడ్డెక్కాలంటేనే ప్రజలు భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. అడ్డదిడ్డంగా సంచరిస్తున్న జంతువులతో ఏ ప్రమాదం ఎలా జరుగుతుందో తెలియని పరిస్థితి. తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం మాత్రం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏటు చూసినా పశువులు, కుక్కలే..

పట్టణంలోని రహమత్‌పురం సర్కిల్ నుంచి రైల్వే రోడ్డు, బాలాజీ సర్కిల్, పరిగి బస్టాండ్ , చిన్నమార్కెట్, అంబేడ్కర్, ఆర్టీసీ బస్టాండు, పరిగి రోడ్డు, మేళాపురం క్రాస్ వరకూ ఏ మార్గంలో చూసినా పశువులు, కుక్కలు, పందులే దర్శనమిస్తున్నాయి. నడిరోడ్డుపై నిలిచిపోవడంతో వాహనదారులు హారన్లు మోగించినా ప్రయోజనం లేకపోవడంతో వాహనాదారులే పక్కనుంచి వెళ్లాల్సిన పరిస్థితి వస్తోంది. ఈఏడాదిలో దాదాపు 80 మందికి పైగా కుక్కకాటులతో ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందారు. అలాగే 25 మందికి పైగా ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స తీసుకున్నారు. కుక్కలు రోడ్లపై స్వైర విహారం చేస్తున్నా మున్సిపల్ అధికారులు మాత్రం కుక్కలను పట్టి వాటికి ఆపరేషన్లు చేసి వాటి సంఖ్య పెరగకుండా నియంత్రించలేకపోతున్నారు.

2 వేలకు పైగా కుక్కలు...



పట్టణంలో రహదారులపై సుమారు 80 నుంచి 100 పశువులు సంచరిస్తుండగా 2 వేలకు పైగా కుక్కలు, 10 వేలకు పైగా పందులు ఉన్నట్లు మున్సిపల్ అధికారులు అంచనా వేశారు. అయితే అవి జనవాసంలో రాకుండా నియంత్రించడంలో మాత్రం వారు విఫలమయ్యారు.



ప్రధాన రహదారిపై వాహనాలకు అడ్డుగా నిలిచిన పశువులు



పాండురంగనగర్ ప్రాంతంలో సంచరిస్తున్న పందులు

కుక్కల బెడద ఎక్కువగా ఉంది



పట్టణంలోని ఏవీధిలో చూసినా కుక్కలు బెడద ఎక్కువగా ఉంది. వాహనాలపై వెళ్తుంటే వెంటపడుతున్నాయి. దీని వల్ల తరచూ ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. కుక్కలకు తోడు రహదారుల్లో పశువులు, పందులు కూడా తిరుగుతున్నాయి. అడ్డదిడ్డంగా జంతులు రహదారులపై తిరుగుతుండటంతో ఇబ్బంది పడుతున్నాము.
– షేక్ సిద్ధిక్, హిందూపురం

చర్యలు తీసుకుంటాం



రహదారుల్లో పశువులు వదలకూడదని యజమానులను ఇప్పటికే హెచ్చరించాము. వారు పట్టించుకోకపోతే మాత్రం నేరుగా పశువులను గోశాలలకు తరలిస్తాము. అలాగే కుక్కల నియంత్రణకు స్టెరిలైజేషన్ చేసేందుకు తరలించాలని నిర్ణయం తీసుకున్నాం. అలాగే పందుల విషయంలో కలెక్టర్, ఉన్నతాధికారులకు తెలియజేసి త్వరలోనే చర్యలు తీసుకుంటాం. – సంగం శ్రీనివాసులు, కమిషనర్, హిందూపురం

పుస్తక పఠనంతో విజ్ఞానం

హిందూపురం టౌన్: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని గ్రంథాలయంలో ఆదివారం గ్రంథాలయాధికారి శ్రీధర్ ఆధ్వర్యంలో కవి సమ్మేళనం, గ్రంథాలయాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ప్రముఖ కవి సడ్లపల్లె చిదంబరెడ్డి, కల్లూరు రాఘవేంద్ర, సొంటి జయప్రకాష్, ఎంసీ గంగాధర్, రిటైర్డ్ ఎస్కే యూనివర్సిటీ లైబ్రేరియన్ ఎల్‌వీ గుండురావు, ఉపాధ్యాయులు రెడ్డప్ప హాజరై మాట్లాడారు. పుస్తక పఠనంతో విజ్ఞానం సాధ్యమన్నారు.

అమరాపురం/లేపాక్షి/చిలమత్తూరు: విద్యార్థులు, యువతీ యువకులు, నిరుద్యోగులు, పెద్దలు పుస్తకాలు చదవడం ద్వారా జ్ఞానాన్ని పొందవచ్చని గ్రంథాలయ శాఖాధికారులు తెలిపారు. అమరాపురం, లేపాక్షి, చిలమత్తూరు గ్రంథాలయాల్లో పుస్తక పఠనం , కవిసమ్మేళనాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాల ఉపయోగాలను వివరించారు.



హిందూపురం: గ్రంథాలయ వారోత్సవాల్లో మాట్లాడుతున్న సొంటి జయప్రకాష్

ద్విచక్రవాహనాల ఢీ

సోమందేపల్లి: మండలంలోని పాపిరెడ్డిపల్లి సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్న ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. రెండు వాహనాలు పాలసముద్రం వైపు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. నాగినాయని చెరువు గ్రామానికి చెందిన అరవింద్‌కు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం బెంగళూరు తరలించారు. పాలసముద్రంకు చెందిన శ్రీకాంత్‌కు గాయాలు కాగా హిందూపురం ఆస్పత్రికి తరలించారు. అతి వేగమే ప్రమాదానికి కారణమని స్థానికులు చెబుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వైద్య శిబిరానికి స్పందన

హిందూపురం టౌన్: పట్టణంలోని అల్‌హిలాల్ పాఠశాలలో ఆదివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఉచిత మూర్ఛ వ్యాధి చికిత్స శిబిరం నిర్వహించారు. 123 మంది రోగులకు రెండు నెలలకు సరిపడా మాత్రలను పంపిణీ చేశారు. జేవీవీ నియోజకవర్గ అధ్యక్షుడు రామకృష్ణ, శ్రీనివాసులు, లక్ష్మీపతి, ఉగ్రప్ప, నాగేంద్రచారి, రవీంద్రారెడ్డి, ప్రభాకర్, గంగిరెడ్డి, వెంకటరామిరెడ్డి, మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా రవికుమార్



నూతన పదాధికారులను సన్మానిస్తున్న దృశ్యం

పావగడ: నియోజకవర్గ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా రెవెన్యూశాఖకు చెందిన హెచ్‌వీ రవికుమార్ విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి యతికుమార్‌పై 31 ఓట్ల తేడాతో విజయభేరి మోగించారు. అలాగే ట్రెజరర్‌గా ఐటీఐ కళాశాలకు చెందిన శేఖర్‌బాబు తన సమీప ప్రత్యర్థి రామాంజినప్పపై 32 ఓట్ల ఆధిక్యంతో గెలిచారు. రాజ్య పరిషత్ సభ్యుడిగా విద్యాశాఖకు చెందిన గంగాధర్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి, ప్రిన్సిపాల్ రామకృష్ణప్ప తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఆదివారం ఉద్యోగుల సంఘానికి సంబంధించిన ఓట్లను లెక్కించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు డా కిరణ్‌కుమార్ సంఘం భవన నిర్మాణానికి తన వంతుగా రూ.5 లక్షల విరాళాన్ని ప్రకటించారు.

వైభవంగా రంగనాథుడి రథోత్సవం



అశేష జనవాహిని మధ్య సాగుతున్న రంగనాథస్వామి రథోత్సవం

హిందూపురం: గుడ్డం రంగనాథస్వామి బ్రహ్మ రథోత్సవం అశేష భక్తజన వాహిణి మధ్య ఆదివారం కనుల పండువగా జరిగింది. ఆలయ అర్చకులు గోవింద శర్మ ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాతసేవతో మూలవిరాట్ రంగస్వామికి అభిషేకాలు, పుష్ప, తులసీ పత్రాలతో అర్చనలు చేశారు. రథాన్ని విశేషంగా అలంకరించగా పండితులు రథం ఎదుట రంగుల ముగ్గులతో ధాత్రిహోమం, రథాంగ హోమాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను మేళా తాళాలతో భక్తుల గోవింద నామస్మరణలతో రథంలో కొలువుదీర్చారు. ఆ తర్వాత రంగనాథస్వామి గోవిందా.. అంటూ భక్తులు రథాన్ని లాగారు. భక్తులు రథంపై పూలు, అరటిపండ్లు విసిరి కొర్కెలు నెరవేర్చాలని భగవంతున్ని కోరుకున్నారు.



పల్లకీలో శ్రీదేవి భూదేవి సమేత రంగనాథున్ని మోసుకొస్తున్న భక్తులు



రథం ముందు మహిళల కోలాటం

కనకదాస జయంతికి తరలిరండి

పెనుకొండ: అనంతపురంలోని కేటీఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఈ నెల 18న కురుబల కుల దైవం భక్త కనకదాస జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నట్లు మంత్రి సవిత తెలిపారు. కార్యక్రమానికి కురుబ కులస్తులు పెద్ద ఎత్తున ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. పట్టణంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఆదివారం కురుబ సంఘం నాయకులతో కలసి మంత్రి సవిత మాట్లాడారు. కురుబ సంఘం పెద్దలు హిందూపురం పార్లమెంట్ సభ్యుడు బీకే. పార్థసారథి, కర్నూలు ఎంపీ నాగరాజు, కురుబ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, జిల్లా అధికారులు పెద్ద ఎత్తున పాల్గొంటారని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి సవిత

ఉరుసులో పాల్గొన్న మంత్రి

పెనుకొండ రూరల్: మండంలోని హనుమపల్లిలో తాలికేరప్ప, ఉజ్జనప్ప స్వాముల ఉరుసు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బీసీ సంక్షేమశాఖా మంత్రి సవిత ఉరుసులో పాల్గొని స్వామివార్లకు మొక్కులు చెల్లించుకున్నారు.

ఆదర్శప్రాయుడు 'వాల్మీకి'

అమరాపురం: మండల పరిధిలోని హలుకూరులో వాల్మీకి కులస్తులు వాల్మీకి జయంతి ఉత్సవాలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ఆంజనేయస్వామి ఆలయం ముందు భాగాన ఉన్న వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. రామాయణాన్ని రచించి వాల్మీకి అందరికీ ఆదర్శ ప్రాయుడయ్యారన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.

పావగడ: తాలూకాలోని కరియమ్మనపాళ్య గ్రామంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా వాల్మీకి విగ్రహానికి పూజలు నిర్వహించారు. అనంతరం వాల్మీకి చిత్రపటాన్ని గ్రామంలో పెద్ద ఎత్తున ఊరేగించారు. ఇందులో భాగంగానే మహిళలు జ్యోతులు మోశారు. డీసీసీ బ్యాంక్ సీనప్ప, లోకేశ్ పాళేగార్, అంజన నాయక, ఓంకార నాయక, భాస్కర నాయక, విజయమ్మ, కరియమ్మ, శశి కళ తదితరులు పాల్గొన్నారు.



పావగడ: జ్యోతులు మోస్తున్న మహిళలు

ఘనంగా కనకదాసు జయంతి

పరిగి: మండలంలోని గొరవనహళ్లిలో కురుబల ఆరాధ్య దైవం భక్త కనకదాసు జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామ కురుబ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు కురుబ సంఘం నాయకులు పాల్గొన్నారు. మేళ తాళాలు, డప్పు వాయిద్యాల నడుమ వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో మహిళలు జ్యోతులను నెత్తిన పెట్టుకుని ఊరేగింపుగా వెళ్లి బీరప్ప ఆలయానికి వెళ్లి సమర్పించారు. కార్యక్రమంలో గ్రామ కురుబ పెద్దలు, కులస్తులు పాల్గొన్నారు.



జ్యోతులు మోస్తున్న మహిళలు

నేడు హిందూపురంలో...

హిందూపురం: భక్త కనకదాసు జయంతి సందర్భంగా సోమవారం ఉదయం 9 గంటలకు పట్టణంలోని గురునాథ్ సర్కిల్‌లోని కనకదాసు విగ్రహం వద్ద ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గం సమన్వయకర్త టీఎన్.దీపిక, నాయకుడు వేణురెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

అరుణాచల యాత్రకు బస్సులు

హిందూపురం: హిందూపురం నుంచి అరుణాచలం పుణ్యక్షేత్రానికి ఆదివారం రెండు సూపర్ లగ్జరీ బస్సులు బయలు దేరాయి. కార్తీకమాసంలో భక్తులు అధిక సంఖ్యలో అరుణాచలానికి వెళ్లేందుకు మొగ్గు చూపు తున్నారని ఆర్టీసీ అధికారులు చెప్పారు. ఈనెలలో చివరి వారం 24వ తేదీ ఆదివారం అరుణా చలానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు.

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

మడకశిరరూరల్: మండలంలోని ఆమిదాలగొంది, ప్రభుత్వ ఒకేషనల్ కళాశాలలో అపార్ ఐడీ నమోదుకు ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆదివారం ఎంఈఓలు భాస్కర్, నరసింహమూర్తి తెలిపారు. అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) గుర్తింపు నంబర్ల నమోదుకు ఈ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఆధార్ కార్డులో తప్పులు ఉన్న విద్యార్థులు సరిచేసుకుని అపార్ ఐడీ నమోదు చేసుకోవాలని సూచించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

లేపాక్షి: మండలంలోని సదాశివనగర్‌కు చెందిన సీపీఐ నాయకుడు గంగన్న ఇటీవల గుండెపోటుతో చనిపోయారు. ఈ నేపథ్యంలో ఆదివారం సీపీఐ మండల కార్యదర్శి, సీనియర్ నాయకుడు నారాయణరెడ్డి, రైతు సంఘం నాయకుడు గోవిందప్ప, తదితరులు బాధిత కుటుంబాన్ని ఆదివారం పరామర్శించారు. గంగన్న ఎంతో కాలంగా సీపీఐలో పనిచేస్తూ ప్రజా సమస్యలపై పోరాటాలు సాగించారని కొనియాడారు. ఇల్లు కూడా నిర్మించుకోలేకపోయాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

శ్రీకృష్ణ గ్రామ సంకీర్తన



నడింపల్లిలో గ్రామ సంకీర్తన చేస్తున్న దృశ్యం

హిందూపురం: హరే కృష్ణ మూమెంట్ హిందూపురం బృందం ఆధ్వర్యంలో నడింపల్లిలో శ్రీకృష్ణ నగర సంకీర్తన కార్యక్రమం ఆదివారం జరిగింది. కార్యక్రమానికి హరే కృష్ణ మూమెంట్ బెంగళూరు అధ్యక్షులు భక్త బృంద దాసు పాల్గొని నగర సంకీర్తన నిర్వహించారు. గ్రామవీధుల్లో ఊరేగింపు నిర్వహించి శ్రీకృష్ణ భక్తి గీతాలు ఆలపిస్తూ గ్రామ సంకీర్తన చేశారు.

రథయాత్రకు ఘన స్వాగతం



రథయాత్రకు ఘన స్వాగతం పలుకుతున్న పదాధికారులు

పావగడ: మండ్య ప్రాంతంలో వచ్చే నెల 20 నుంచి 23 వరకూ జరిగే 87వ కన్నడ సాహిత్య సమ్మేళన వేడుకలను పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా కన్నడ జ్యోతి రథయాత్ర నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే ఆదివారం తాలూకాలోని అరసికెరె గ్రామానికి కన్నడ జ్యోతి రథయాత్ర చేరుకుంది. లింగదహళ్లి, రంగసముద్రం, కోటగుడ్డ గ్రామాల మీదుగా వైఎన్ హొసకోట ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం సాయంత్రం పావగడ పట్టణానికి రథయాత్ర చేరుకోగా రెవెన్యూ అధికారులు, కసాప, కన్నడ పర సంఘాల పదాధికారులు ఘన స్వాగతం పలికారు.

హైదరాబాద్ నుంచి శబరిమలకు పాదయాత్ర



పడిపూజలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు

పెనుకొండ రూరల్: హైదరాబాద్ నుంచి శబరిమల వరకూ అయ్యప్ప మాలధారులు పాదయాత్ర చేపట్టారు. ఇందులో భాగంగానే ఆదివారం పెనుకొండ 44వ జాతీయ రహదారి దుద్దేబండ క్రాస్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా షిర్డిసాయిబాబా ఆలయంలో పడిపూజ, భజనలు చేశారు. అయ్యప్పస్వాములకు ఆలయ ధర్మకర్త అన్నదానం చేశారు.

అయ్యప్పస్వామి ఆలయంలో అన్నదానం

పెనుకొండ: పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయం వద్ద ఆదివారం సత్యసాయి సేవా సమితి, పలువురు దాతలు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం వారపు సంత కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు, యాచకులు, నిరుపేదలు అన్నదానాన్ని సద్వినియోగం చేసుకున్నారు.

నేడు విద్యుత్ సరాఫరాలో అంతరాయం

రొళ్ల: మండల పరిధిలోని బీజీ.హళ్లి విద్యుత్ సబ్‌స్టేషన్ 33 -11కేవీ ఏలో మరమ్మతు కారణంగా సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరాఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఇన్‌చార్జ్ ఏఈ నిజాముద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. బీజీ.హళ్లి, మల్లినమడగు, ఎం.రాయపురం, అగళి మండలం హళ్లికెర పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

శుభకార్యం



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ఈరలక్కప్ప

గుడిబండ: మండల పరిధిలోని తాళికెర గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కెంచప్ప కుమారుడు రాజేష్, చందన వివాహ వేడుక స్వారమ్మ ఆలయంలో ఆదివారం ఘనంగా జరిగింది. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప, నాయకులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో నాయకులు రాయుడు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.